క్లుప్తంగా

హనిమిరెడ్డి గెలవాలని కొండెక్కిన దివ్యాంగుడు



కొండ ఎక్కుతున్న దివ్యాంగుడు వెంకట్రావు

అద్దంకి: వైఎస్సార్ సీపీ అద్దంకి ఎమ్మెల్యే అభ్యర్థి పానెం చిన హనిమిరెడ్డి ఎమ్మెల్యేగా గెవాలని కోరుతూ సంతమాగులూరు మండలంలోని మిన్నెకల్లు గ్రామానికి చెందిన కంబంపాటి వెంకట్రావు వినూత్న రీతిలో మొక్కు తీర్చుకున్నాడు. శుక్రవారం మోకాళ్లపై నంద్యాల జిల్లాలోని యాగంటి బసవేశ్వరుడి క్షేత్ర కొండ మెట్లు ఎక్కాడు. అదే విధంగా రాష్ట్రంలో మరోసారి సీఎం జగన్ మోహన్‌రెడ్డి అధికారంలోకి రావాలనే ఆకాంక్షతోనూ తాను ఈమెట్లు మోకాళ్లపై ఎక్కినట్లు గ్రామస్తులు తెలిపారు.

రాయితీపై పచ్చిరొట్ట విత్తనాలు

బల్లికురవ: ప్రభుత్వం రాయితీపై రైతులకు 50 శాతం రాయితీపై పచ్చిరొట్ట విత్తనాలు మండలానికి 110 క్వింటాళ్లు కేటాయించిందని వ్యవసాయాధికారిణి ఎస్‌పీపీ కుమారి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. 40 క్వింటాళ్ల వంతున జనుము, జీలుగ, 30 క్వింటాళ్ల పిల్లిపెసర మండలంలోని 20 రైతు భరోసా కేంద్రాలకు కేటాయించారని తెలిపారు. జనుము, జీలుగ, రాయితీ పోను కిలో రూ.44, పిల్లిబిసర కిలో రూ.67 చెల్లించి రైతు భరోసా కేంద్రాల్లో పేర్లు నమోదు చేసుకోవాలని ఆమె తెలిపారు.

ఈఏపీ సెట్ పరీక్షలకు 461 మంది హాజరు



పరీక్షలకు హాజరైన విద్యార్థులు

వేటపాలెం: స్థానిక సెయింట్ ఆన్స్ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ కళాశాల్లో ఏపీ ఇంజినీరింగ్ కామన్ ఎంట్రన్స్ పరీక్షలకు 461 మంది విద్యార్థులు హాజరైనట్లు కళాశాల సెక్రటరీ వనమా రామకృష్ణారావు శుక్రవారం తెలిపారు. పరీక్షలు ఉదయం, సాయంకాలం రెండు విడతల్లో నిర్వహించారు. ఈపరీక్షలకు మొత్తం 492 మంది విద్యార్థులు హాజరుకావాల్సి ఉండగా 461 మంది హాజరైనట్లు తెలిపారు.

పౌష్టికాహారంతో గర్భిణులకు మేలు



పౌష్టికాహారం అందిస్తున్న డాక్టర్ గంగాదేవి

వేటపాలెం: గర్భిణులు ప్రతి రోజు పౌష్టికాహారం తప్పనిసరిగా తీసుకోవాలని ప్రసూతి గర్భకోశవ్యాధి నిపుణురాలు వై గంగాదేవి తెలిపారు. దేశాయిపేట పంచాయతీ నీలకంఠాపురంలో గల అనాథ వృద్ధ శరణాలయం ఆధ్వర్యంలో పేద గర్భిణులకు పౌష్టికాహారం శుక్రవారం పంపిణీ చేసి మాట్లాడారు. గర్భిణులు ఐరన్, కాల్షియం టాబ్లెట్స్ ఎలా వాడాలో వివరించారు. వారు తీసుకోవాల్సిన ఆహార నియమాలుపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఆశ్రమ కన్వీనర్ సత్రం మల్లేశ్వరరావు బీ రవికిరణ్, ఆశ్రమం కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

బాధితుడికి ఆర్థిక సాయం



అద్దంకి రూరల్: ఈనెల 14న రోడ్డు ప్రమాదంలో గాయపడిన అద్దంకిలోని 20 వవార్డుకు చెందిన నంబూరి కోటేశ్వరరావు నరసరావుపేటలోని వైద్యశాలలో చికిత్స పొందుతున్నారు. శుక్రవారం 20 వవార్డు కౌన్సిలర్ గుంజి కోటేశ్వరరావు ఆధ్వర్యంలో ఆ వార్డులోని యువకులు క్షతగాత్రుడికి ఆర్థిక సహాయం చేశారు. వార్డులో కౌన్సిలర్, పెద్దలు యువకులను అభినందించారు.

నేటి నుంచి మాధవస్వామి పవిత్రోత్సవాలు

కారంచేడు: నేటి నుంచి మండల కేంద్రమైన కారంచేడులో కొలువైన భూనీళా సమేత ప్రయాగ మాధవస్వామివారి ఆలయంలో పవిత్రోత్సవాలు ప్రారంభించనున్నట్లు ఆలయ అర్చకులు వేదాంతం కిరణ్‌కుమార్, ఆలయ కార్యనిర్వహణాధికారి సీహెచ్ వేణుగోపాలరావు, ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు ఒక ప్రకటనలో తెలిపారు. రెండు రోజుల పాటు నిర్వహించే ఈఉత్సవాల్లో నవగ్రహ శాంతియుత దశావతార మహాయజ్ఞ సహిత లక్ష తులసీ దళార్చనలతో పాటు, శాంతి కల్యాణం నిర్వహించనున్నట్లు వారు పేర్కొన్నారు. మంగళవాయిద్యాలు, సుప్రభాత సేవలతో ప్రారంభిస్తామన్నారు. భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని స్వామివారి ఆశీస్సులు, దీవెనలు, తీర్థప్రసాదాలు స్వీకరించాలని వారు తెలిపారు.

రంగును చూసి కొంటే.. రోగమే



అరటి పండ్లను పరిశీలిస్తున్న ఫుడ్ సేఫ్టీ అధికారి (ఫైల్)



అమ్మకానికి సిద్ధంగా మామిడి పండ్లు

- పండ్ల పక్వానికి రసాయనాల వాడకం
- అరటి పండ్లపై ఇథోఫిన్ రసాయనం వాడుతున్న వ్యాపారులు

చీరాల అర్బన్: 'మేడి పండు చూడ మేలిమై యుండు.. పొట్ట విప్పి చూడ పురుగులుండు' అనే వేమన పద్యం సరిగా సరిపోతుంది ఫలాలకు. పండు బాగా ఉందని కొంటే.. అంతేసంగతులు తినగానే రోగాలు కొని తెచ్చున్నట్టే. నిగనిగలాడుతూ ఆకర్షణీయంగా మంచి రుచి రంగు తేలే తియ్యటి రసాలు ఊరి మాధుర్యాన్ని అందించే మామిడి పండంటే ఇష్టం ఉండని వారుండరు. వేసవిలో వచ్చే మామిడి పండంటే అందరూ ఇష్టంగా తింటారు. కాని ఆ ఫలం సంప్రదాయ పద్ధతులతోనే పండిందా లేదా రసాయనాలతో పండించారా అనేది ముందు తెలుసుకోవాలి. ఆకర్షణీయంగా ఉంటే చాలు ప్రజలు ఇష్టంగా కొనుగోలు చేస్తారు. మధుర ఫల ప్రియుల బలహీనతను అసరా చేసుకొని కొందరు వ్యాపారులు హానికర రసాయనాలతో అసాధారణ రీతిలో మాగబెడుతున్నారు. దీని వలన ఆరోగ్యం దెబ్బతింటుందని నిపుణులు చెప్తున్నారు.

వివరాల్లోకి వెళితే..

మధుర ఫలంగా పిలుచుకునే మామిడి పండును వేసవి కాలంలో ప్రజలు ఎక్కువగా కొనుగోలు చేస్తారు. అయితే ఆ పండును అసాధారణ పద్ధతుల్లో మాగబెడుతున్నారు. చీరాల పరిసర ప్రాంతాలకు ఎక్కువగా ఉలవపాడు, నూజివీడు మామిడి పండ్లు ఎక్కువగా వస్తుంటాయి. సీజన్‌లో వచ్చే పండు కావడంతో పండని పండ్లను ఎక్కువగా కొనుగోలు చేసి వాటిని మాగబెడుతున్నారు. మామిడి తోటల నుంచి వ్యాపారులు గుత్తగా కాయలను కొంటుంటారు. అలా కొనుగోలు చేసిన మామిడి పండ్లను నిషేధిత రసాయనాలతో మాగబెడుతున్నారు. చెట్టు నుంచి కోసిన మామిడి పండు పండాలంటే కొంత కాలం పడుతుంది. అలా కాకుండా ప్రజల ప్రాణాలతో చెలగాటమాడే రసాయనాలు వాడుతున్నారు.

పక్వానికి తెచ్చేందుకు రసాయనాలు వాడకం..

పండు పక్వానికి రావాలంటే కొంత సమయం పడుతుంది. గుత్తగా కొనుగోలు చేసిన పండ్లు త్వరగా పక్వానికి తీసుకురావాలని అపాయకరమైన రసాయనాలను వాడుతున్నారు. అరటి పండ్లు ఎక్కువ రోజులు నిల్వ ఉండేందుకు, ఆకర్షణీయమైన రంగు వచ్చేందుకు అపాయకరమైన ఇథోఫిన్ అనే రసాయనాన్ని పిచికారీ చేస్తున్నారు. ఇటువంటి పండ్లను తినడం వలన ప్రమాదం ఉంది. శరీరంపై తీవ్ర ప్రభావం చూపుతుంది. తలనొప్పి, దీర్ఘకాలిక సమస్యలు వస్తాయి. రసాయనాల ద్వారా పండించిన పండ్లను తీసుకున్న వారికి గ్యాస్ట్రిక్ సమస్యలు వస్తాయి. మామిడి పండ్లను మాగబెట్టడంలో సంప్రదాయ, సాంకేతిక పద్ధతులు పాటించడంలో ఎంతో మేలని వ్యవసాయ నిపుణులు సూచిస్తున్నారు. మామిడి పండ్లే కాకుండా ఇతర రకాల పండ్లను కూడా ఇలానే వాడి త్వరగా పండేందుకు వ్యాపారులు ప్రయత్నిస్తున్నారు. ఇలా మాగబెట్టిన మామిడి రూ.100–120, డజన్ అరటి పండ్లు రూ.60–70, సపోట కిలో రూ.60–70 బహిరంగ మార్కెట్‌లో విక్రయిస్తున్నారు.

గత నెలలో తనిఖీలు చేసిన ఫుడ్ ఇన్‌స్పెక్టర్..

చీరాల పట్టణంలోని మార్కెట్ సెంటర్ వద్ద గల అరటి పండ్ల దుకాణాలపై గత నెలలో జిల్లా ఆహార భద్రతాధికారులు దాడులు నిర్వహించారు. పలు అరటిపండ్ల నుంచి శాంపిల్స్ సేకరించి ల్యాబ్‌కు పంపించారు. చీరాలలో అరటి పండ్లు తొందరగా పండేందుకు వ్యాపారులు కెమికల్స్‌ను ఉపయోగిస్తున్నారని గుర్తించారు. హానికరమైన కెమికల్స్‌ను వినియోగిస్తూ తాజా పండ్ల పేరుతో అరటికాయల వ్యాపారం చేస్తున్నారు. కెమికల్స్ ద్వారా పండిస్తున్న అరటిపండ్లను ప్రత్యక్షంగా చూశారు. అరటి పండ్ల వ్యాపారులకు అవగాహన కల్పించారు.

రసాయనాలు చాలా ప్రమాదకరం..

మామిడికాయలపై కాల్షియం కార్బైడ్, అరటి పండ్లపై ఇథోఫిన్ పూయడాన్ని ప్రభుత్వం నిషేధించింది. అలానే వ్యాపారులు కూడా తీవ్రంగా నష్టపోతున్నారు. ఎక్కువ కాలం నిలవ ఉండవు. దీంతో కొంత మంది వ్యాపారులు ఇథోఫిన్‌ను వినియోగిస్తున్నారు. సంప్రదాయ పద్ధతుల్లో పండ్లను మాగబెట్టాలి. అలా కాకుండా ఇథోఫిన్‌ను పిచికారీ చేస్తున్నారు. అరటి పండ్ల నుంచి నమూనాలు సేకరించి ల్యాబ్‌కు పంపాం. రిపోర్టులు వచ్చిన తర్వాత వారిపై చర్యలు తీసుకుంటాం.

– జి.ప్రభాకరరావు, జిల్లా ఆహారభద్రతాధికారి

ఏ అభ్యర్థికి ఓటేశారో నంబర్ నొక్కండి !

- ఫోన్ సర్వేలతో ఓటర్లను విసిగిస్తున్న టీడీపీ

చీరాల టౌన్: 'మీ నియోజకవర్గ శాసనసభ ఎన్నికల్లో మీరు ఏ పార్టీ అభ్యర్థికి మీరు ఓటు వేశారు. టీడీపీ అభ్యర్థికి అయితే 1 నొక్కండి. వైఎస్సార్ సీపీ అభ్యర్థికి అయితే 2 నొక్కండి..' అంటూ టీడీపీ సర్వే పేరుతో ఓటర్లను ఫోన్ సర్వే చేయిస్తున్నారు. ఎన్నికల కోడ్ అమలులో ఉన్న నేపథ్యంలో ఎన్నికలు ముగిసిన తర్వాత కూడా టీడీపీ నేతలు ఫోన్ సర్వేలు చేస్తూ ఓటర్లు నుంచి ప్రజాభిప్రాయాలను సేకరిస్తున్నారు. వివరాల్లోకెళ్తే.. రెండు రోజుల నుంచి చీరాల నియోజకవర్గంలోని ఓటర్లకు 86453 79683, 86453 79130 ఫోన్‌నెంబర్ల నుంచి ప్రజాభిప్రాయ సేకరణ పేరుతో ఓటర్లకు ఫోన్లు చేసి మీరు ఏ పార్టీ అభ్యర్థికి ఓటు వేశారు ? మీ అభిప్రాయాలను తెలపండని ప్రశ్నిస్తున్నారు. మీరు టీడీపీ అభ్యర్థికి ఓటేస్తే 1 నొక్కండి, వైఎస్సార్ సీపీ అభ్యర్థికి ఓటేస్తే 2 నొక్కండి, ఇతరులకు ఓటు వేస్తే 3 నొక్కండి అంటూ ఓటర్లు నుంచి అభిప్రాయం సేకరిస్తున్నారు. సగటున 10 మందిలో 8 మందికి ఈ నంబర్ ద్వారా ఫోన్లు చేసి నియోజకవర్గంలో ప్రజాభిప్రాయాలను తీసుకుంటున్నారు. ఎలాగైనా టీడీపీ అధికారంలోకి రావాలనే అక్కసుతో ఈ ప్రజాభిప్రాయ సేకరణ చేస్తుందని ఓటర్లు అంటున్నారు. అయితే ఓటర్లు మాత్రం తమ అభిప్రాయాలను చెప్పాలా ? వద్దా ? అనే సంశయంలో ఉన్నారు. ఎన్నికల కోడ్ అమలులో ఉంటే ఈ సర్వేలు ఏంటని కొందరు, ఓటర్లను ఎలాగైనా తమ పార్టీకి ఓట్లు వేశారో ? లేదో ? తెలుసుకోవడం ఏంటని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. చీరాల పట్టణం, రూరల్ గ్రామాల్లో ఎక్కడ చూసినా, పలు కూడళ్లు, హోటళ్లల్లో కూడా ఇదే చర్చలు జరగడం విశేషం. అసలు ఈ సర్వేల అంతర్యం ఏంటని ప్రజలు చర్చించుకుంటున్నారు.

వైఎస్సార్ సీపీకే మహిళల జేజేలు



ఓటు వేయడానికి క్యూలో నిల్చున్న మహిళా ఓటర్లు (ఫైల్)

- ప్రతి మండలంలోనూ మహిళలదే ఆధిక్యం
- కొరిశపాడులో అధిక సంఖ్యలో ఓటు వినియోగించుకున్న మహిళలు

అద్దంకి: సంక్షేమ పథకాల ద్వారా లబ్ధిపొందిన మహిళలు మళ్లీ తిరిగి వైఎస్సార్ సీపీ ప్రభుత్వం రావాలనే ఉద్దేశంతో ఓటేయడానికి పోటెత్తారు. పింఛన్లు పొందే వృద్ధ మహిళలు, వైఎస్సార్ చేయూత, ఆసరా, సున్నా వడ్డీ, ఇళ్ల స్థలాలు ఇలా లబ్ధిపొందిన ప్రతి కుటుంబంలోని మహిళలు సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డిని నమ్మి ఓటు వేశారని విశ్వసనీయ సమాచారం. ఎన్నికల కోడ్ తర్వాత పింఛన్లు, వలంటీర్ల వ్యవస్థను మహా కూటమి అడ్డుకోవడంతో ప్రజలంతా వారిని నమ్మలేదని సమాచారం. ఈనెల 13న నిర్వహించిన సార్వత్రిక ఎన్నికల్లో నియోజకవర్గంలోని అద్దంకి, అద్దంకి రూరల్, బల్లికురవ, జే పంగులూరు, కొరిశపాడు, సంతమాగులూరు మండలాల్లో పురుష ఓటర్ల కన్నా స్త్రీ ఓటర్లే అధికంగా తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. జే పంగులూరు మండలంలో పురుష ఓటర్ల కన్నా 352 కొరిశపాడు మండలంలో పురుష ఓటర్ల కన్నా స్త్రీ ఓటర్లు, 1083 మంది, అద్దంకి, అద్దంకి రూరల్‌లో పురుష ఓటర్ల కాన్న 31మంది స్త్రీ ఓటర్లు, బల్లికురవ మండలంలో పురుష ఓటర్ల కన్నా 380 మంది స్త్రీ ఓటర్లు, సంతమాగులూరు మండలంలో పురుష ఓటర్ల కన్నా 168 మంది స్త్రీ ఓటర్లు తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు.

సంక్షేమ పథకాలకు జై..

స్త్రీ ఓటరు సరళిని విశ్లేషిస్తే గత ఎన్నికలకంటే అధికంగా స్త్రీ ఓటర్లు తమ ఓటు హక్కును పురుషులకన్నా వినియోగించుకున్నారు. ఇది వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ప్రవేశపెట్టిన మహిళా సంక్షేమం వారిలో చైతన్యం తెచ్చి ఉంటుందని, మహిళా ఓటింగ్ అత్యధిక శాతం నమోదు కావడం తమ పార్టీకే లబ్ధి చేకూరుస్తుందని వైఎస్సార్ సీపీ ధీమాగా చెప్తోంది. అయితే ఓటింగ్ శాతం అది తమకే లబ్ధి చేకూరుస్తుందని, ప్రత్యర్థి పార్టీలు చెప్తున్నాయి కాని అంత ధైర్యంగా లేరని నాయకులు గుసగుసలాడుతున్నారు. ఏది ఏమైనా ఈ సారి మహిళాఓటర్ల శాతం పెరగం పట్ల ఆయా పార్టీలు తమకే లబ్ధి చేకూరుతుందంటూ చెప్పుకొస్తున్నాయి.

మండలాల వారీగా ఓటు వినియోగించుకున్న
స్త్రీ, పురుష ఓటర్ల వివరాలు..

మండలం	పురుషులు	స్త్రీలు
అద్దంకి	30,637	30,668
సంతమాగులూరు	22,068	22,226
బల్లికురవ	19,724	20,104
జే. పంగులూరు	18,703	19,055
కొరిశపాడు	14,479	15,552

ఘనంగా వీరబ్రహ్మేంద్రస్వామి ఆరాధన



అద్దంకిలో పూజలు చేసిన బ్రహ్మంగారి దేవస్థాన కమిటీ సభ్యులు



దండుదారి వద్ద ఉన్న ఆలయంలో వీరబ్రహ్మేంద్ర స్వామి మూలవిరాట్

అద్దంకి రూరల్: బ్రహ్మంగారి ఆరాధన మహోత్సవాన్ని స్థానిక కాకానిపాలెం, భవాని సెంటర్‌వద్దనున్న బ్రహ్మంగారి దేవస్థానాల్లో శుక్రవారం దేవస్థాన కమిటిలు ఘనంగా నిర్వహించారు. దీనిలో భాగంగా వేదపండితులు బొప్పూడి కోటేశ్వరరావు, సత్తెనపల్లి శ్రీశైలం ఆధ్వర్యంలో స్వామివారికి దేవతామూర్తులకు పంచామృత స్నానం, గణపతిపూజ, పుణ్యాహవచనం, పూజాకార్యక్రమాలు నిర్వహించారు. అనతరం అన్నవితరణ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్‌ల్ ఎస్తేరమ్మ, పొన్నుపల్లి బ్రహ్మానందం, చెన్నుపల్లి శ్రీనివాసచారి, ఉండవల్లి కృష్ణారావు, వెంకటసుబ్బారావు, చింతలపూడి వీరయ్య, , వార్డు కౌన్సిలర్‌లు తదితరులు పాల్గొన్నారు.

యద్దనపూడి: మండల పరిధిలోని గన్నవరం–మార్టూరు దండు దారి వద్ద వేంచేసి ఉన్న గోవింద మాంబ సమేత పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయంలో శుక్రవారం ఆరాధన మహోత్సవం ఘనంగా నిర్వహించారు. అభిషేకాలు, హోమాలు, భజనా కార్యక్రమాలతో పాటు జెండా ఊరేగింపు మహోత్సవాన్ని నిర్వహించారు. అనంతరం అన్నదాన వితరణ చేశారు.

చినగంజాంలో..

చినగంజాం: మండలంలోని రాజుబంగారుపాలెం పంచాయతీ కుక్కలవారిపాలెం గ్రామంలో వేంచేసియున్న శ్రీమద్విరాట్ వీరబ్రహ్మేంద్ర స్వామి ఆలయంలో శుక్రవారం బ్రహ్మేంద్ర స్వామి ఆరాధనోత్సవాలు ఘనంగా నిర్వహించారు. గురుస్వామి కొణసం సుబ్బారెడ్డి ఆధ్వర్యంలో స్వామి వారికి విశేష పూజా కార్యక్రమాలను నిర్వహించారు. ముందుగా మాలధారణ స్వాములు సముద్ర స్నానమాచరించి స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ద్వారం అంకిరెడ్డి, కోకి వెంకటరామిరెడ్డి, కొణసం శ్రీనివాసరెడ్డి, మంచాల శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

క్రికెట్ పోటీలు ప్రారంభం



కొమ్మాలపాడు-మల్లాయపాలెం జట్ల మధ్య పోటీ

బల్లికురవ: మండలంలోని కొణిదెన గ్రామంలో జిల్లాస్థాయి టెన్నిస్‌బాల్ క్రికెట్ పోటీలు శుక్రవారం ప్రారంభమయ్యాయి. జిల్లాలోని వివిధ ప్రాంతాలకు చెందిన 32 బృందాలు ఎంట్రీలు సమర్పించినట్లు నిర్వాహక కమిటీ సభ్యులు తెలిపారు. ఉదయం నక్కబొక్కలపాడు, మార్టూరు జట్ల మధ్య జరిగిన పోరులో నక్కబొక్కలపాడు జట్టు సాయంత్రం మల్లాయపాలెం, కొమ్మాలపాడు జట్ల మధ్య పోటీ జరిగింది. 15 రోజుల పాటు పోటీలు నిర్వహించి మొదటి, రెండు, మూడు బహుమతులుగా రూ.20,116. రూ.15,116, రూ.10,116 అందిస్తామని నిర్వాహక కమిటీ తెలిపారు.

104తో ఇంటింటికీ వైద్యం



వైద్య పరీక్షలు చేస్తున్న వైద్యాధికారి

బల్లికురవ: ప్రభుత్వం ఏర్పాటు చేసిన 104 వాహనం ద్వారా వైద్య వసతి లేని గ్రామీణ ప్రాంతాల ప్రజలకు షెడ్యూల్ ప్రకారం వైద్య సేవలు అందిస్తున్నట్లు గుంటుపల్లి పీహెచ్‌సీ వైద్యాధికారి జీ రవితేజ అన్నారు. శుక్రవారం ఉప్పమాగులూరు సచివాలయంలో వృద్ధులు, బాలింతలు, గర్భిణులకు పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. సాయంత్రం శిబిరానికి రాలేని వారికి ఇంటింటికీ వెళ్లి వైద్య పరీక్షలు చేసి మందులు అందజేశారు. వర్షాలు కురుస్తున్నందున దోమల ఉధృతి పెరిగే అవకాశం ఉందన్నారు. దోమ కాటుతో డెంగీ జ్వరాలు సోకే అవకాశం ఉన్నందున ప్రతి ఒక్కరూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని చెప్పారు.

దోమకాటుకు గురికాకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఈ క్యాంపులో వైద్య, ఆరోగ్య శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

వైభవంగా పోలేరమ్మ అమ్మవారి తిరునాళ్లు



ఘటంకుండ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న భక్తులు

చీరాల టౌన్: మండలంలోని కొత్తపాలెం గ్రామ పంచాయతీలో కొలువుతీరిన కొత్తపాలెం పోలేరమ్మ అమ్మవారి 24వ వార్షికోత్సవ తిరునాళ్లు శుక్రవారం ప్రారంభమయ్యాయి. ఈనెల 17 నుంచి 21 వరకు జగరనున్న పోలేరమ్మ అమ్మవారి తిరునాళ్లను వైభవంగా నిర్వహించేందుకు అన్నీ ఏర్పాట్లు పూర్తి చేశామని కమిటీ అధ్యక్షుడు బక్కా శివప్రసాద్ రెడ్డి తెలిపారు. తిరునాళ్ల ప్రారంభం సందర్భంగా శుక్రవారం ఘటంకుండ కార్యక్రమంతో వేడుకలు ప్రారంభించారు. అలానే మహాలక్ష్మీ అమ్మవారి పూజలు, అమ్మవారి సేవ, తిరునాళ్ల రోజు శిడిమాను మహోత్సవం, ప్రభోత్సవ వేడుకలను వైభవంగా నిర్వహిస్తున్నామని, తిరునాళ్ల రోజు కమిటీ ఆధ్వర్యంలో మ్యూజికల్ నైట్ ఏర్పాటు చేశామని తెలిపారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొనాలని కమిటీ ప్రతినిధులు సుబ్బారెడ్డి, కృష్ణారెడ్డి, సిద్ధారెడ్డి, సురేష్‌రెడ్డి, శ్రీనివాసరెడ్డి, రాంబాబురెడ్డి తెలిపారు.

వృద్ధాశ్రమానికి రోటరీ క్లబ్ చేయూత



వృద్ధులకు గొడుగులు అందిస్తున్న రోటరీ సభ్యులు

పర్చూరు (చినగంజాం): పర్చూరులో నూతనంగా ఏర్పాటు చేసిన ఆశ్రయ వృద్ధాశ్రమానికి రోటరీ క్లబ్ ఆఫ్ పర్చూరు సెంట్రల్ చేయూతనందించింది. వరగానికి చెందిన ప్రవాసాంధ్రులు వెలగా చార్వాణి ఆర్థిక సహకారంతో ఆశ్రమానికి రూ.10 వేలు విలువ కలిగిన ఇనుప బీరువా, వృద్ధులకు పండ్లు, గొడుగులు అందించారు. నూతన వృద్ధాశ్రమంలో వృద్ధులు అందరూ ఆరోగ్యంగా, సంతోషంగా ఉండాలని క్లబ్ అధ్యక్షుడు నాగబైరు శ్రీనివాసరావు ఈసందర్భంగా అన్నారు. కార్యక్రమంలో క్లబ్ కార్యదర్శి పంబి సదానందరెడ్డి, రోటరీ సభ్యులు పాబోలు ఉదయభాస్కర్, కోమటి ఆంజనేయులు, పాబోలు వెంకన్న, పోలిశెట్టి చంద్రం, ఆశ్రమ నిర్వాహకులు భవనం శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

సిలిండర్ పేలి బడ్డీ కొట్టు దగ్ధం



సిలిండర్ పేలి కాలిబూడిదైన బడ్డీ కొట్టు

మేదరమెట్ల: బడ్డీకొట్టులో సిలిండరు పేలడంతో కొట్టు దగ్ధమైంది. ఈఘటన శుక్రవారం కొరిశపాడు మండలంలోని రావినూతల గ్రామ శివారులో జరిగింది. అందిన సమాచారం మేరకు.. గ్రామానికి చెందిన వల్లపు నాగయ్య కుర్రవానిపాలెం రోడ్డులో బ్రాందీషాపు సమీపంలో దుకాణం పెట్టుకొని జీవనం సాగిస్తుంటాడు. శుక్రవారం సిలిండర్‌ను మార్చుకునే సమయంలో ఒక్కసారిగా మంటలు వ్యాపించాయి. దీంతో నాగయ్య భయంతో బయటకు పరుగులు తీయగా బడ్డీ కొట్టు పూర్తిగా దగ్ధమైంది. కొట్టుతో పాటు పక్కనే ఉన్న మోటారు బైకు కూడా కాలి బూడిదైందని నాగయ్య వాపోయాడు. బడ్డీ కొట్టుతో జీవనం సాగించే తనకు రూ.1 లక్షకు పైగా ఆస్తి నష్టం వాటిల్లిందని తనను అధికారులు ఆదుకోవాలని నాగయ్య వేడుకొన్నాడు.

డ్రైనేజీ సమస్య తీర్చండి మహాప్రభో..



వ్యర్థాలు పేరుకుపోయిన మురుగు నీటి వాగు

చినగంజాం: గొనసపూడి దళిత వాడలో నెలకొన్న డ్రైనేజీ సమస్యను పరిష్కరించాలని కాలనీ వాసులు కోరుతున్నారు. దళిత వాడలో మురుగు నీరు పోయే మార్గం సక్రమంగా లేకపోవడంతో ఎదురయ్యే సమస్యలతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. మురుగు నీటి వాగు కాలువలో గ్రామంలోని వ్యర్థ పదార్థాలు పేరుకు పోయి నీరు పోయే మార్గం పూర్తిగా నిలిచి పోయింది. మామూలుగా వాగులోని మురుగు నీరు నేరుగా వెళ్లి కృష్ణ కాలువలో కలిసి పోయి ప్రవహించేది. గొనసపూడి గ్రామంలోని దనియాల వాగు గుండా చీలిన వాగు గ్రామం మొత్తంలోని మురుగు నీటిని తీసుకొని వచ్చి ఈ మురుగు నీటి వాగులో కలుస్తుంది. అయితే వాగు దళిత వాడలో ఉంటడం నీరు పోయే మార్గం పూర్తిగా నిలిచిపోయింది. దాంతో దళిత కుటుంబాలు ఇబ్బందులు పడుతున్నారు. మురుగు నీరు నిలిచి పోవడంతో దుర్వాసన వెదజల్లడంతో పాటు దోమలకు కేంద్రాలుగా మారిపోయాయి. దాంతో గ్రామంలో అంటు వ్యాధులు, టైఫాయిండ్, డెంగీ ప్రాణాంతక వ్యాధులు అలముకుంటున్నాయి. మురుగు నీటి సమస్యపై అధికారుల దృష్టికి పలు మార్లు విన్నవించినప్పటికీ ఫలితం లేకుండా పోయిందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు సమస్యను పరిష్కరించాలని తమ దళిత కాలనీని కాపాడాలని వారు కోరుతున్నారు.

ఎక్కడ చూసినా ఎన్నికల చర్చే !

- ఫలితాలపై సర్వత్రా ఉత్కంఠ
- లెక్కలతో కుస్తీ పడుతున్న నాయకులు

జే.పంగులూరు: ఎన్నికల సమరం ముగిసింది. ఫలితాలు ఈవీఎంలలో నిక్షిప్తమయ్యాయి. గెలుపుపై ఎవరి అంచనాలు వారికి, ఎవరి ధీమాలు వారికి ఉన్నాయి. అయితే గ్రామాల్లో ఎన్నికల వేడి మాత్రం ఇంక తగ్గలేదు. ఏ నలుగురు గుమిగూడిన చోట ఫలితాలు, మెజార్టీలపైనే జోరుగా చర్చసాగుతోంది. గ్రామాల్లో ఈ పరిస్థితి మరీ అధికంగా ఉంది. అధికార పార్టీకి ఎంత మెజార్టీ వస్తుంది, ఏ ఓటర్లు ఏ పార్టీకి మొగ్గ చూపుతున్నారు ? రచ్చబడ చర్చలు కొనసాగుతున్నాయి. పోల్ మేనేజ్‌మెంట్ ప్రభావం ఎంత, తమకు అనుకూలంగా ఉన్న అంశాలేంటి, గెలుపు ఏవిధంగా ఉండబోతుంది ? ప్రత్యర్థికి బలహీనంగా మారిన పరిస్థితులు, తద్వారా గ్రామాల వారీగా మెజార్టీ వచ్చేందుకు ఏ పార్టీకి అవకాశం ఉందన్న లెక్కలు జోరుగానే వేస్తున్నారు. ఫంక్షన్లు, పెళ్లిళ్ల ఇలా సందర్భంగా ఏదైనా మాత్రం ఎన్నికల ఫలితాల పైనే ఉంటోంది.

వివిధ అంశాలపై ఆరా...

గ్రామాల వారీగా తమవైపు నిలబడే ఓటర్ల లెక్కలను గ్రామస్థాయి నాయకుల ద్వారా పోటీదారులు, వారి వర్గం వారు ఆరా తీస్తున్నారు. రాజకీయంగా చురుగ్గా ఉండే నాయకులకు స్థానికంగా లెక్కల మాట ఆటుంచితే, ఇతర ప్రాంతాల్లో బంధువులు, స్నేహితుల నుంచి ఫోన్లు కూడా అధికంగా వస్తున్నాయి. తమ నియోజకవర్గ చర్చలతో పాటు ఉమ్మడి ప్రకాశం జిల్లాలో కీలకంగా నిలచే స్థానాల్లో ఫలితం ఏటన్న అంశం కూడా ఈ చర్చల్లో ప్రధాన భూమిక పోషిస్తోంది. ఏదిఏమైనా ఫలితాలు వెలువడే వరకు ఈ చర్చలు కొనసాగుతూనే ఉంటాయన్నది ఒప్పుకోవాల్సిందే.